ప్రాప్తిస్థానము :


మేనేజరు,

శ్రీ శుకబ్రహ్మాశ్రమం (P.O)

శ్రీకాళహస్తి. (Tq.) చిత్తూరు జిల్లా (A.P

ముద్రణ : కళ్యాణ్ ప్రెస్, శ్రీకాళహస్తి.

అధ్యాత్మ జడ్జిమెంటు



దైవప్రార్థన

కరుణామూర్తియగు దేవా! మాచిత్తము సర్వకాలసర్వావస్థల యందును మీ పాదారవిందములయందు లగ్నమై అచంచల మైన భక్తితో కూడియుండునట్లు అనుగ్రహింపుడు.

పరమదయానిధీ ! ప్రాతఃకాలమున నిద్రలేచినది మొదలు మఱల పరుండు వఱకును మనోవాక్కాయములచే మా వలన ఎవరికిని అపకారము కలుగకుండునట్లును, ఇతర ప్రాణికోట్లకు ఉపకారము చేయులాగునను సద్బుద్ధిని దయచేయుడు.

సచ్చిదానందమూర్తీ ! నిర్మలాత్మా ! మా యంతఃకరణము నందు ఎన్నడును ఏ విధమైన దుష్టసంకల్పముగాని, విషయ వాసనగాని, అజ్ఞానవృత్తిగాని, జొరబడకుండునట్లు దయతో అనుగ్రహింపుడు!

వేదాంతవేద్యా ! అభయస్వరూపా ! మా యందు భక్తి,జ్ఞాన, వైరాగ్య బీజము లంకురించి శీఘ్రముగ ప్రవృద్ధములగునట్లు ఆశీర్వదింపుడు ! మఱియు ఈ జన్మమునందే కడతేరి మీ సాన్నిధ్యమున కేతెంచుటకు వలసిన శక్తి సామర్థ్యములను కరుణతో నొసంగుడు.

దేవా! మీరు భక్తవత్సలురు ! దీనుల పాలిటి కల్పవృక్ష స్వరూపులు! మీరు తప్ప మాకింకెవరు దిక్కు ? మిమ్ము ఆశ్రయించితిమి. అసత్తునుండి సత్తునకు గొనిపొండు! తమస్సు నుండి జ్యోతిలోనికి తిసికొనిపొండు ! మృత్యువునుండి అమృతత్వమును పొందింపజేయుడు. ఇదే మా వినతి. అనుగ్రహింపుడు. మీ దరి జేర్చుకొనుడు.

పాహిమాం, పాహిమాం, పాహిమాం, పాహి

ఓం తత్ సత్

అధ్యాత్మ జడ్జిమెంటు

శ్రీ శుకబ్రహ్మాశ్రమము

శ్రీ కాళహస్తి.

1994

వెల ; రూ. ~~4-00~~ 5-00

1993 వరకు — 10 వేలు కాపీలు
1994 సం॥ — 2 వేలు కాపీలు

సత్యాభిసంధానరతో విముక్తో
మహత్త్వమాత్మీయముపైతి నిత్యమ్
మిథ్యాభిసంధానరతస్తు నశ్యే
ద్దృష్టం తదేతద్యదచోరచోరయోః

(వివేక చూడామణి)

సత్యమగు ఆత్మను ఆశ్రయించువాడు బంధ విముక్తుడై మహత్తరమగు శ్రేయమును సదా పడయు చుండును. మిథ్యమగు దేహాదిదృశ్యమును ఆశ్రయించువాడు వినాశమును, దుఃఖమును పొందును. లోకములో దొంగ కానివాడు సుఖమును, దొంగయగువాడు దుఃఖమును పొందుచుండుట కానంబడుచున్నది గదా!

ఓమ్

తొలిపలుకు

ప్రతి జీవియొక్క హృదయమందును ధర్మాధర్మములకు, న్యాయాన్యాయములకు, సత్యాసత్యములకు, ఆత్మానాత్మలకు పెద్ద పోరు జరుగుచుండును అందును ముముక్షువుయొక్క హృదయమందు ఈ పోరు అతి తీవ్రముగ నుండును. ప్రతిపక్షస్థానమందున్న మాయ పరమార్థక్షేత్రమున పురోగతి నొందుచున్న సాధకుని పడగొట్టుటకై ఎన్నియో పన్నాగములు పన్నుచుండును. అత్యంత ధైర్యోపేతమైన బుద్ధిమాత్రమే ఈ సంగ్రామమున విజయము గాంచగలదు. జీవుని హృదయాంతరాళమున అహర్నిశము జరుగుచుండు ఈ ఆత్మానాత్మల సంఘర్షణ ఈ గ్రంథమున అత్యంత మనోరంజకముగ వర్ణింపబడినది. సద్గురువను జడ్జి యొక్క సాన్నిధ్యమున వాది యగు ముముక్షువునకు, ప్రతివాదులగు కామాదులకు జరిగిన వాద వివాదములు, పూర్వపక్ష ప్రతిపక్ష ప్రకటనలు ఇందు మనోహరముగ చిత్రింపబడినవి.

తుదకు జడ్జియొక్క తీర్పున్ను వివరింపబడినది. అధ్యాత్మక్షేత్రమున పురోగమించు సాధకులకు ఈ గ్రంథము చక్కగ ఉపకరించగలదు. అభ్యంతర ప్రతీప శక్తులపై విజయమును సాధించుటయందు దత్తచిత్తులగు ముముక్షువులకు ఈ చిన్నపొత్తము లెస్సగ తోడ్పడగలదని విశ్వసించుచున్నాము.

ఇట్లు,

ప్రకాశకులు.

అధ్యాత్మ జడ్జిమెంటు

— ం —

కోర్టు - పరమార్థక్షేత్రము

జడ్జి:- సద్గురువు.

వాది:- ముముక్షువగు జీవుడు.

వాది వకీలు:- అతిసూక్ష్మగ్రాహియగు సాత్త్వక బుద్ధి.

వాది సాక్షులు:- (1) వివేకము (2) వైరాగ్యము (3) శమము (4) దమము (5) ఉపరతి (6) తితీక్ష (7) శ్రద్ధ (8) సమాధానము (9) విశ్వాసము.

వాది తరపు దస్తావేజులు :- నాలుగు వేదములు, అద్వైత శాస్త్రములు మున్నగునవి.

ప్రతివాదులు;- అజ్ఞానము, కామ్యకర్మ.

ప్రతివాదుల వకీలు:- ఘోర మూఢబుద్ధి.

ప్రతివాదుల సాక్షులు :- (1) ధనాత్మ (2) కళత్రాత్మ
(3) పుత్రాత్మ (4) దేహాత్మ (5) ప్రాణాత్మ
(6) మనోమయాత్మ (7) విజ్ఞానమయకోశాత్మ
(8) ఆనందమయకోశాత్మ (9) శూన్యాత్మ.

ప్రతివాదుల రికార్డులు :- ఇహలోక, పరలోక కాముకులైన పూర్వీకుల వాడుక ప్రకారము వ్రాయబడి యుండిన పాత చిత్తా.

జీవుడు చిన్మయపరమాత్మ స్వరూపుడు. అతడు మృణ్మయుడు కాడు, చిన్మయుడు. దేహము కాదు, దేహియగు ఆత్మ. కాని అజ్ఞానవశమున అనేక జన్మలయందు తాను దేహమనియే తలంచి నానా క్లేశములను బొందుచు ఏదియో సుకృతము వలన మానవజన్మను బడసి, పెద్దల సాంగత్యముచే తాను నిత్యశుద్ధబుద్ధముక్త పరమాత్మయే యని యెఱిఁగి అట్టి తన ఆత్మరూప సంపత్తిని, తన జన్మహక్కును తిరిగి సంపాదించు నిమిత్తము పరమార్థ క్షేత్రమను కోర్టులో దావా వేసెను.

ముముక్షుత్వము గల్గి మోక్షాధికారియైన జీవుడు తాపత్రయముచే మిగుల వ్యధనొంది, దానినుండి తప్పించుకొనదలంచినవాడై, మఱియు ఆత్మలాభమను సొత్తును అరిషడ్వర్గమను చోరులనుండి స్వాధీనపఱచుకొను ఉద్దేశ్యము గల్గి, వాది ప్రతివాదులను, ఉభయకక్షల సాక్షులను చక్కగ విచారించి తీర్మానించుటకు మిగుల సమర్థుడైనట్టియు, లంచము

తీయనట్టియు, సత్యసంధుడై యెప్పునట్టియు, నిష్పక్షపాతియై, సూక్ష్మబుద్ధియుక్తుడై, పరమదయాళుడై, సాత్త్వికుడైనట్టియు, పరమార్థ న్యాయస్థానాధిపతి యైనట్టియు సద్గురు సార్వభౌముని యెదుట తనకు న్యాయము గలుగునని మదిని దలంచి !సచ్చిదానంద స్వరూపమగు పరబ్రహ్మమును సర్వులును నిరాక్షేపముగా ననుభవించులాగున చేయు నిమిత్తము వ్యాజ్యము వేసెను.

నవద్వారశోభితమగు దేహమను పట్టణమందు తురీయంబను సింహాసనమం దారూఢుడై, సత్యజ్ఞానానంద సర్వవ్యాపక జ్యోతిర్మయ స్వరూపుడైనట్టి సద్గురువను జడ్జిగారు కొలువు తీర్చియుండగా, అత్తఱి ఆధ్యాత్మిక ఆధిభౌతిక ఆధిదైవికములను తాపత్రయములను బొందిన ముముక్షువగు జీవుడను వాది సూక్ష్మగ్రాహియగు సాత్విక బుద్ధియను న్యాయవాది **(Vakil)** మూలముగ ఈ క్రింది విధమగు అర్జీ దాఖలు చేసెను :—

అనంత కల్యాణ గుణగణ శోభిత సమరస సన్మార్గ స్వతంత్ర చిన్మయస్వభావ సువిచారరూప పరమార్థ న్యాయ నిర్ణయస్థానాధిపతియగు పరిపూర్ణ పరబ్రహ్మస్వరూపాపరోక్ష సాక్షాత్కార సద్గురు చక్రవర్తియై వెలుంగు న్యాయాధిపతి **(Judge)** గారి సన్నిధానమునకు నిరపరాధియగు ముముక్షువైన జీవుడను వాది శిరస్సాష్టాంగ నమస్కారము లాచరించి సమర్పించుకొనిన విజ్ఞప్తి యేమనగా—

అయ్యా ! అరిషడ్వర్గసమేతుడగు అజ్ఞానమనువాడు బహుకాలము బాగుగ పొంచియుండి తన ఆవరణశక్తిచే ఆత్మయొక్క అసంగత్వ లక్షణమును మఱుగుపఱచి "విక్షేపము"ను బంప, వానిచే గల్పింపబడిన వాసనలతో గూడిన పామరుడు, కర్మఠుడు, మూఢభక్తుడను విరోధులు ఆయాత్మ నాక్రమించి చేలరేగి తమ అనాత్మ పదార్థములతో దానిని జేర్చుకొని తమతో గలసిపోవునట్లు హాని గలుగజేసినారు. కావున అనాది అసంగస్వభావమైయుండునట్టి ఆత్మరూప శాశ్వత ధనమును ఇకముం దెన్నడును పైకనినవారు అపహరింపకుండునట్లును, మఱియు వారి దుర్వాదములను ఖండించి అజ్ఞానమనునది ఆత్మవస్తువును మరుగుపఱచిన మోసమును, ప్రజ్ఞానమును అపహరించిన చౌర్యమును, విక్షేపము మిథ్యాజగత్తును సృష్టించిన క్రౌర్యమును గూర్చి నీతికోవిదులు న్యాయనిర్ణేతలునగు తాము దీర్ఘ విచారణ చేసి వారలను దండించుటయే కాక స్వయంప్రకాశమై సర్వవ్యాపకమైనట్టి ఆత్మయొక్క యాథార్థ్యమును సర్వులు నిరాటంకముగా ననుభవించి సుఖపడునట్లు చేయవలెనని ప్రార్థించుచున్నాను. ఇవ్విషయమును సమర్థించుటకు నా తరపున వివేక వైరాగ్యాది సాక్షు లనేకు లున్నారు. ఈ వివాదసంబంధమైన శాసనములగు ఉపనిషత్తులు, భగవద్గీత, అద్వైత శాస్త్రములు మున్నగువానిని ఈ నా అర్జీతో సహా జతపఱచి దాఖలు

చేసియున్నాను, కాబట్టి ధర్మనిర్ణేతలగు తాము కటాక్షించి నిష్పాక్షిక విచారణ సలిపి న్యాయంబొసంగ వేడుకొనుచున్నాను.

ఇట్లు,

భవద్విధేయుడు,

(Sd.) ముముక్షువు.

ముముక్షు వనఁ వాది వివాదపత్రములో పొందుపరచిన ఉపనిషదాది ప్రమాణములను శోధించి సద్గురువను జడ్జి ప్రతివాదులకు ఈ క్రింది విధమగు శాసనములను గావించెను-

నిత్యశుద్ధబుద్ధముక్తమై వెలయు ఆత్మస్వరూపమును మీరును, మీతో జేరినవారును దురాక్రమణముగా సంగ్రహించి, మాయజేసి దుర్వినియోగము చేయుచున్నారనియు, అట్లు చేయుట న్యాయవిరుద్ధమనియు, ఎల్లప్రాణులకును ఆయాత్మస్వరూపము జన్మహక్కనియు, దానిని సర్వులును అనుభవించులాగున తీర్పుచేయవలెననియు, ప్రతివాదులు చేసిన మోసము, చౌర్యము క్రౌర్యము మున్నగు తప్పులకు వారలను దండించవలెననియు, ముముక్షువగు వాది మిమ్ములను ప్రతివాదులనుగా జూపి వివాదపత్రమును మా యొద్దకు పంపియుండుటచే ఈ శాసనమును జూచిన తక్షణమే మీరిచటికేతెంచి తగు సమాధానములను చెప్పవలెను. మీరు మీ సాక్షులతో సహా ఇంటికి రానియెడల మీ పరోక్షముననే

కేసు విధ్యుక్తముగ విచారించబడి తగురీతి తీర్మానించబడగల దని న్యాయనిర్ణేతలు ఉత్తరువు కావించుచున్నారు.

(ఆ శాసనము అందగనే ప్రతివాదులు వెంటనే జడ్జిగారి సమ్ముఖమునకు వచ్చి ఈ క్రింది విధముగ విన్నపము గావించు కొనిరి_]

చిన్మయస్వరూప సువిచార వేదాంతోచిత పరమార్థ న్యాయ బ్రహ్మస్వరూపా పరోక్ష సాక్షాత్కార సద్గురు ప్రభువు గారి సన్నిధానమునకు ప్రతివాదులగు (1) అజ్ఞాని (2) పామరుడు (3) కర్మఠుడు (4) మూఢభక్తుడు - అను మేము నలుగురము నమస్కరించి వ్రాసికొనిన విన్నపము ఏమనగా - ఈ వాదియొక్క వివాద విషయిక విజ్ఞాపనము కేవలము అబద్ధము. ఆతడు కావించినదియంతయు ఉన్మత్త ప్రలాపము ఆత్మరూప ధనము సర్వజన సామాన్యమైనది ఎప్పుడును కానేరదు. ఆ ప్రకారముగ అది అందఱికిని సొంతహక్కు, స్వతంత్రమైనది అనుట సర్వాబద్ధము, మే మొక్కొక్కరము అనాదిగా దానిని స్వాతంత్ర్యముతో అనుభవించుచున్నాము. కనుక ఫిర్యాది అగు వాది దాని ననుభవించుటకు అర్హుడు కాడు. మరియు ఈ కేసులో వివాదాస్పదమైన ధనము అనాది కాలమునుండి తాతల ముత్తాతల కాలమునుండీ మా యనుభవములోనే యున్నది. దానికి గడువు మీరుట వలన కాలదోషము పట్టి పోయినది. ఇక దానిని గుఱించి ప్రశ్నించుటకైనను వాదికి అర్హతలేదు. కాబట్టి దానిని మా యొద్దయుండి తీసి వాదికి

ఇచ్చుట యెంత మాత్రము తగదు, వివాద సొత్తును మేము అక్రమముగా తీసికొననందున మమ్ములను దండించుట కేవలము అన్యాయమే యగును. కావున పైన తెలిపిన ధనాదులను మా యొద్దనే ఎప్పటివలె నుంచుటే కాక, వాదియొక్క వివాదమును త్రోసిపుచ్చి ఆ అన్యాయ వివాదములవలన మాకు కలిగిన నష్టమునంతను వాది యిచ్చుకొనునట్లు తీర్పు చేయవలెనని గౌరవనీయులైన న్యాయాధిపతిగారిని (**Honourable Judge**) మఱి మఱి ప్రార్థించుచున్నాము.

ఇందులకు సాక్షులు—(1) ధనాత్మ (2) కళత్రాత్మ (3) పుత్రాత్మ (4) దేహాత్మ (5) ప్రాణాత్మ (6) మనోమయుడు (7) విజ్ఞానమయుడు [8] ఆనందమయుడు [9] శూన్యాత్మ. వీరికి తగిన ప్రమాణములకును, ఇహలోక కాముకులైన జనుల సంప్రదాయానుసారముగ వ్రాసియుంచిన లెక్కలను, పరలోక కాముకులైన పెద్దలనుష్ఠించిన కర్మకాండ రూప ప్రమాణములను, ఆగమ పురాణేతిహాస సంబంధములైన సిద్ధాంతములను క్లుప్త కాల మతిక్రమింపక పంపియున్నాము. కనుక ఆ రికార్డు అంతయు దేవరవారు పరికించి క్రమప్రకారముగ, న్యాయముగ, ధర్మబద్ధముగ విచారించి, అనేకులు తీర్పు చేసినట్టి మా పక్షమునే స్థిరపఱచ ప్రార్థించుచున్నాము.

ఇట్లు విన్నవించు,

అజ్ఞాని, పామరుడు, కర్మఠుడు నమస్కారములు

ప్రతివాది వకీలగు మూఢబుద్ధి చేవ్రాలు—

న్యాయాధిపతులైన సద్గురువుయొక్క సన్నిధానమందు వాది తెచ్చిన వివాదమును, అందులకు ప్రతివాదు లిచ్చిన సమాధానపత్రములను చదివి కోర్టువారిచ్చిన ఇష్యూలేవనగా—

1. వివాదగ్రస్తమైన ఆత్మ యను సొత్తు సర్వజన సామాన్యమైనదా? లేక, ఏ కొందఱియొక్క మాత్రమే స్వాధీన వస్తువా?

2. ఈ వాది నేరమును తెచ్చుటకు అర్హుడా, కాడా?

3. ఈ వివాదము కాలనిర్ణయ శాసనమునకు అనుగుణ్యముగా నున్నదా, లేదా?

4. వివాదస్పదమగు ఆత్మ యను సొత్తును అక్రమముగా దాచియుంచిన ప్రతివాదులు దండనార్హులా, కావా!

5. వాదికి వివాదధనమును తీసి ఇవ్వవచ్చునా. లేదా?

ఈ ప్రకారముగ కోర్టువారు ఐదు నిబంధనలను ప్రకటించి గడువు కాలమును ఏర్పాటు చేసిరి. గడువు పూర్తి కాగానే వాదిప్రతివాదులు తమ తమ సాక్షులతో గూడ న్యాయస్థానమునకు రాగా, మొట్టమొదటి ప్రతివాదియొక్క సాక్షులన్ధు విచారించవలసినదిగా కోర్టువారు ఆదేశించిరి—

ప్రతిపక్షుల విచారణ

1వ సాక్షియగు ధనాత్మవాది విచారణ

(ధనమే ఆత్మయని వాదించువాని విచారణ)

కోర్టునందు సభ్యులందఱును నిశ్చలముగ గూర్చొనియుండ, ఇంతలో ఘోర మూఢబుద్ధి యను ప్రతివాది వకీలు లేచి ధనాత్మను 'నీ పేరేమి' అని అడిగి అతనిని కోర్టువారి ముందు నిలిపి 'సద్గురు న్యాయాధీశుని యెదుట నిజము తప్ప అన్యమేదియు వచింపను' అని ప్రమాణము చేయించి ఇట్లు ప్రశ్నించెను—

ప్ర :- నీ వెవరు?

ఉ :- నేను ధనికుడను.

ప్ర :- ఆత్మను నీ వెఱుఁగుదువా?

ఉ :- ధనమే ఆత్మ.

ప్ర :- ఇందులకు ప్రమాణము లేవైన కలవా?

ఉ :- కలవు. చెప్పెదను వినుము,

1. యస్యాస్తి విత్తం స నరః కులీన
స్స పండితస్స శ్రుతవాన్ గుణజ్ఞః
స ఏవ వక్తా స చ దర్శనీయ
స్స ర్వే గుణాః కాంచనమాశ్రయన్తి.

ఎవనికి ధనము కలదో వాడే కులవంతుడు, పండితుడు, శ్రోత్రియుడు, గుణవంతుడు, వక్త. ఆతనినే దర్శింపవలెను. సుగుణములన్నియు ధనమునే ఆశ్రయించుచున్నవి.

2. వేదమూలమిదం బ్రాహ్మ్యం
భార్యామూలమిదం గృహమ్
కృషి మూలమిదం ధాన్యం
ధనమూలమిదం జగత్.

బ్రాహ్మణత్వమునకు మూలము వేదము, గృహమునకు మూలము భార్య, ధాన్యమునకు మూలము కృషి, జగత్తునకు మూలము ధనము.

ఈ మొదలైన ప్రమాణము లనేకములుకలవు, కావున ధనమే ఆత్మ యగును.

ప్ర :- ధనమే ఆత్మయనుట కేదైన యుక్తి చెప్పగలవా ?

ఉ :- లోకములో ధనము లేని వానిని తిరస్కరించి, ధనమున్న వానిని చూచినంతమాత్రమున అందఱును లేచి వందనమొనర్చి మర్యాద చేయుచున్నారు గదా ! ఇంతకు మించిన యుక్తి మఱేమి కావలయును !

ప్ర :- ధనమే ఆత్మ యనుటకు అనుభవమును చూపగలవా ?

ఉ :- ధనమును చూచినపుడు, తాకినపుడు, జను లానంద భరితులై యుండుటయే ప్రత్యక్షానుభవము.

ఈ ప్రకారముగ ప్రమాణయుక్త్యనుభవములతో చెప్పిన ధనాత్మవాదిని జూచి వాది వకీలగు సూక్ష్మగ్రాహియను సాత్త్వికాంశబుద్ధి వానిని ఈ క్రింది విధముగ క్రాసు పరీక్ష చేయుచున్నాడు

క్రాసు పరీక్ష

ప్ర:- నీవు ధనమే నేనని చెప్పుచున్నావా, లేక ధనము నాదని చెప్పుచున్నావా? నీ వింత వఱకు చెప్పిన వాక్యములన్నియు అవివేకులును తత్త్వశాస్త్ర పరిజ్ఞాన శూన్యులును అనుభవరహితులు లౌకికులు చెప్పినవే యగును. అయ్యవి తత్త్వశాస్త్ర కోవిదులును, అనుభవజ్ఞులనగు పారమార్థికులకు అంగీకార యోగ్యములుకానేరవు నీవు చెప్పిన యుక్తులను వాదములను నేనిపుడు చక్కని ప్రమాణములచే, తర్కముచే పటాపంచలుచేయగలను. ఎట్లనగా శాస్త్ర వాక్యములను వినుము.

1. అర్థానామార్జనే దుఃఖమార్జితానాం తు రక్షణే
నాశేదుఃఖం వ్యయే దుఃఖంకిమర్థం దుఃఖ భాజనమ్.

ధనమును ఆర్జించుట కష్టము. ఆర్జించిన దానిని రక్షించుట కష్టము, అది నశించునపుడు ఇంకను కష్టము. కావున ఇట్టి దుఃఖప్రదమగు ధనమువలన ఏమి ప్రయోజనము?

2. మాతాపుత్ర విరోధాయ హిరణ్యాయ నమోనమః
తల్లికి, కుమారునికి మధ్యకూడ విరోధమును తెచ్చిపెట్టు
ధనమునకు ఒక నమస్కారము!

3. ధనమెచ్చిన మదమెచ్చును.
మదమెచ్చిన దుర్గుణంబు మానక హెచ్చున్
ధనముడిగిన మదముడుగును
మదముడిగిన దుర్గుణంబు మానును వేమా.

ఆవు పెరిగినచో ఆవు కొమ్ములును పెరుగునట్లు ధనము హెచ్చిన కొలది తృష్ణ (ఆశ) యు అధికమగును.

ఆశాపాశశతైర్బద్ధాః కామ క్రోధపరాయణాః
ఈహన్తే కామభోగార్థమన్యాయేనార్థసంచయాన్.
(భగవద్గీత)

అవివేకులు, అసురసంపద కలవారు ఆశాపాశములచే బద్ధులై, కామ క్రోధ పరాయణులై కామభోగము కొఱకు అన్యాయముగ ధనమును సంపాదించుచుందురు.

అర్థమనర్థం భావయ నిత్యం
నాస్తి తతస్సుఖ లేశస్సత్యం
పుత్రాదపి ధనభాజాం భీతి
స్సర్వత్రైషా విహితా రీతిః
— శంకరాచార్యులు.

ధనము అనర్థమును గలుగజేయుననియు, దానివలన లేశమైనను వాస్తవముగ సుఖము లేదనియు, సొంతకుమారుని జూచినను ధనవంతునకు భయమే కలుగుననియు, సర్వత్ర ఇట్టి యనుభవమే కలుగుచున్నదనియు సదా జ్ఞప్తి యందుంచు కొనుము. కావున ఈ ప్రకారముగ పారమార్థిక సుఖవివర్జిత మైనట్టి ధనము నిత్యానంద దాయకమగు ఆత్మ యని వీ వెట్లు చెప్ప సాహసించితివి. అది శుద్ధతప్పు-అని వాది వకీలు పలుక, ఆ వాక్యములను విని ధనాత్మవాది నోరెత్తక మ్రానువలె నిలబడెను. అంతట జడ్జిగారగు సద్గురువు రెండవ సాక్షియగు కళత్రాత్మవాదిని పిలువ నాజ్ఞాపించెను.

2వ సాక్షియగు కళత్రాత్మవాది విచారణ

అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుఁడైన పరబ్రహ్మము యొక్క సాక్షాత్ స్వరూపమే అయి విలసిల్లుచున్న శ్రీ సద్గురు ప్రభుచక్రవర్తిగారైన జడ్జిగారి సన్నిధానమున ప్రతి వాదుల వకీలగు ఘోర మూఢ బుద్ధియనువాడు లేచి కళ త్రాత్మవాదిని బిలిచి ప్రమాణము చేయించి ఈ ప్రకారముగ ప్రశ్నించెను.

ప్రశ్న :- నీవు ఆత్మను ఎపుడైన ఎఱిఁగియున్నావా ?

ఉత్తరము :- నా కళత్రము [భార్య] నే ఆత్మగా నెఱిఁగి యున్నాను.

ప్ర :- ఇందులకు ప్రమాణ మేదైనా కలదా ?

ఉ :- ప్రపంచములో భార్యయే తానని, తానే భార్యయని పెక్కురు తలంచుచున్నారు. ఇందుల కేలాంటి సంశయము లేదు. ఇది అనేకులకు అనుభవము నందున్న విషయము, భార్యకంటె ప్రియమైన వస్తువు మఱి యొకటి ముల్లోకములందును లేనే లేదని ఎన్నియో గ్రంథములందు పేర్కొనబడినది. కనుకనే ప్రియురాలిని శ్లాఘించి చెప్పు సందర్భము లెన్నియో కావ్య నాటకాదులందు కానవచ్చుచున్నవి. నా వాక్యమును పరిపోషించుట కింత కంటె ప్రబల నిదర్శన మేమి కావలయును?— ఈ ప్రకారముగ ప్రతివాది వకీలు వేసిన ప్రశ్నకు సమాధానమును ఘోర మూఢ బుద్ధి తెలిపి, తన కక్షిని బలపఱచ యత్నింప, వెంటనే వాది వకీలగు సూక్ష్మసాత్త్వికాంశబుద్ధి లేచి ఆ సాక్షిని ఈ ప్రకారముగ క్రాసుపరీక్ష చేయదొడగెను—

వాదివకీలు క్రాసుపరీక్ష

(Cross - Examination)

ఓయీ ఘోరమూఢబుద్ధీ! నీవు సత్సాంగత్య మెపుడైన చేసినావా? సద్గ్రంథపఠనమును గావించితివా? కనుకనే అజ్ఞానపాశబద్ధుడవగు నీవు నీకు తోచిన లౌకిక దృష్టాంతములను యిచ్చినావు. ఇవి విజ్ఞులకు ఆమోద యోగ్యములు

కావు. నీ వాదము దుర్బలమగును. పసలేనిదిగను వున్నది. పారమార్థిక విచారణయను జంఝూమారుతమునందు నీ లౌకి కోక్తులు పుల్లియాకులవగిది యెగిరిపోగలవు. ఎట్లనిన—

కేశకజ్జలధారిణ్యో దుఃస్పర్శాలోచనప్రియాః,
దుష్కృతాగ్నిశిఖా నార్యోదహన్తి తృణవన్నరమ్.

కాటుక దిద్దిన కన్నులుగల స్త్రీలు చూచుటకు సుందరముగా నున్నను, తృణమును అగ్ని దహించి వేయులాగున పురుషుని మోహవశమున దహించివేయుచున్నారు. (కావున వారికి అతి దూరమున నుండవలెను.)

కామనామ్నా కిరాతేన వికీర్ణా ముగ్ధచేతసః
నార్యో నరవిహంగానా మంగబంధన వాగురాః.

మన్మథుడను కిరాతుడు స్త్రీలను వలలనుపన్ని పురుషులను పక్షులను పట్టి బాధించుచున్నాడు. (కావున కడుజాగరూకులై యుండవలెను.)

జన్మపల్వల మత్స్యానాం చిత్తకర్దమ చారిణాం
పుంసాం దుర్వాసనా రజ్జుర్నారీ బడిశపిండికా.

జన్మమను తటాకమందు చిత్తమును బురదనీళ్ళలోపల సంచరించు పురుషులను చేపలను దుర్వాసనయను దారమునందు సంధించి, గాలము వైచి, స్త్రీలను ఎఱవేసి మన్మథుడను బెస్తవాడు పట్టి మోహాగ్నియందు పచన మొనర్చి వైచుచున్నాడు.

దుఃఖశృంఖలయా నిత్యమలమస్తు మమస్త్రియా,
పురుషులకు సంకెళ్ళను బోలియుండును స్త్రీలు. కాబట్టి జాగరూకులై యుండవలెను.

స్త్రియం త్యక్త్వా జగత్త్యక్తం జగత్యక్త్వా సుఖీభవేత్.

స్త్రీ యొక్క తగులాటము వదిలెనేని జగత్తుయొక్క తగులాటము వదులును. జగత్తుయొక్క తగులాటము తీరెనేని మనుజుడు సుఖవంతుడు కాగలడు.

ఈ ప్రకారముగ యాజ్ఞవల్క్యోపనిషత్తు. యోగ వాసిష్ఠము మొదలైన ప్రామాణిక గ్రంథములు ఘోషించు చుండ ఓయీ! నీవేల వారను శ్లాఘించుచున్నావు? నీవు 'భార్య నేన 'ని చెప్పుచున్నావా? లేక 'నా భార్య' యని చెప్పుచున్నావా? నా భార్యయని చెప్పుటవలన, భార్య నీ కంటె వేఱుగానే యుండుటచే, ఆపై సంబంధమైన సుఖదుఃఖ ములను నీవు తాదాత్మ్యధ్యానముచే అజ్ఞానమువలన అనవ సరముగ నీపై వేసుకొనుచున్న వాడవే యగుదువు. పలు విధములైన వ్యసనములు, చింతలు, యాతనలు. వాంఛలు స్త్రీలవలన నీకు కలుగుచుండుటచే వారలను పరమానంద ప్రదలని, సుఖదాత్రులని వచించుట కేవలము అవివేకమే యగును, మఱియు కళత్రమే ఆత్మయని పలుకుట కేవలము అసంగతమున్ను, ప్రమాణవిరుద్ధమున్ను, భ్రాంతిజన్యమున్ను

అగును, కావున, ఆ ప్రకారము చెప్పరాదు-అని వాది వకీలగు సూక్ష్మబుద్ధియడుగగా, కళత్రాత్మవాది యను సాక్షి బదులు చెప్పక దొంగవలె మిణకరించుచు మొద్దువలె నిలిచెను. కోర్టు వారు వానిని అసమర్థుడని యెంచి బయటకు పంపివేసి, మూడవ సాక్షి యగు పుత్రాత్మవాదిని బిలువనంపిరి.

3వ సాక్షియగు పుత్రాత్మవాది విచారణ

నిత్య నిర్మల నిర్గుణ నిరాకార నిర్వికల్ప నిశ్చల పరబ్రహ్మముయొక్క సాక్షాత్ స్వరూపమే అయి వెలు గొందుచున్న శ్రీ సద్గురుప్రభు చక్రవర్తిగారైన జడ్డిగారి సన్నిధానమున ప్రతివాదుల వకీలగు ఘోర మూఢబుద్ధి యను వాడు లేచి పుత్రాత్మవాదిని బిలిచి సర్వశక్తిగల సద్గురు ప్రభువుయొక్క సాన్నిధ్యమున నిజము తప్ప మఱేమియు పలుక' నని అతనిచే ప్రమాణము చేయించి ఇవ్విధమున నాతనిని ప్రశ్నించెను,

ప్ర :- నీ పేరేమి ?

ఉ :- నా పేరు పుత్రాత్మ.

ప్ర :- ఈ వ్యాజ్యమున సొత్తైన ఆత్మ నెఱుఁగుదువా?

ఉ :- పుత్రుడే ఆత్మయని యెఱుఁగుదును.

ప్ర :- పుత్రుడే ఆత్మయని యెట్లెఱిఁగినావు?

ఉ :- అతడు సదానందమై యుండుటవలన.

ప్ర :- పుత్రుడు ఆనంద మెట్లగును ?

ఉ :- పుత్రుడు లేనివాడు సదా దుఃఖము బొందుచున్నాడు. నాకు పుత్రుడున్నందువలననే ఎల్లప్పుడు సుఖముగ నున్నాను.

ప్ర :- పుత్రుడే ఆత్మయనుటకు ప్రమాణ మేదైన చెప్పగలవా?

ఉ :- చెప్పగలను- వినుడు-

1. ఆత్మావై పుత్ర నామాపి పుత్రేణ లోకాన్ జయతి.

2. అపుత్రస్య గతిర్నాస్తి స్వర్గో నైవచ నైవచ
తస్మాత్పుత్రముఖం దృష్ట్వాభవేత్పశ్చాద్ధి తాపసః

3. పున్నామ్నో నరకాద్యస్మాత్ పితరం త్రాయతేస్వయం
తస్మాత్పుత్ర ఇతి ప్రోక్తః స్వయమేవ స్వయం భువాః

ప్రభూ! దేవరా! ఎట్టి వ్యసనము కలిగివను పుత్రుని జూచినంతనే అది తొలగిపోయి ఆనందము కలుగుచున్నది కదా! కాబట్టి పుత్రుడే ఆత్మ యగును.

ఈ ప్రకారముగ పుత్రాత్మవాది పలుకగా అంతట వారి వకీలగు సూక్ష్మ సాత్త్వికాంశబుద్ధి లేచి అప్రతివాది సాక్షిని ఈ ప్రకారముగ క్రాసు పరీక్ష చేయదొడంగెను.

వాదివకీలు చేయు క్రాసుపరీక్ష

ఓయీ! నీవు చెప్పిన ప్రమాణములు సరికావు, శాస్త్ర వాక్యములను నీవు అపార్థము చేసుకొనినావు. నీకు నిజముగా పుత్ర శబ్దమునకు అర్థము తెలిసియున్నచో మాంసాస్థి చర్మ రక్త మలజల సముదాయ మానుషాకార క్రిమి విశేషములను అఖండ సచ్చిదానంద పరిపూర్ణ అత్మవస్తువుగా నీవు తలంప కుందువు. దేహతత్త్వ పరిశోధకులు చిరకాలము పరిశోధనలు చేసి ఈ శరీర మొక జడవస్తువేయని తేల్చి చెప్పివైచిరి. ఇది శుక్ల శోణితముల యొక్క సంయోగము వలన ఏర్పడిన ఒకా నొక పాంచభౌతిక పదార్థమే యగును. ఈ ప్రకారమైన మానవాకారమగు పుత్రు డనువాడు శుద్ధ చైతన్యస్వరూపు డెట్లు కాగలడు? కావున పుత్రుని జూచి ఆత్మయని భ్రమింప దగదు. యాజ్ఞవల్క్యోపనిషత్తునందు ఏమి వచింపబడినదో చూడుము——

అలభ్యమానస్తనయః పితరౌ క్లేశయేచ్చిరం
రబ్ధో హి గర్భపాతేన ప్రసవేన చ బాధతే.

తల్లిదండ్రులకు పుత్రుడులేని కాలమందు దుఃఖమును కలుగజేయును. ఒకవేళ కలిగెనా, గర్భపాతమువలన, ప్రసవాదులవలన వారికి క్లేశమును తెచ్చిపెట్టును.

1. జాతస్య గ్రహరోగాది కుమారస్యచ ధూర్తతా
ఉపవీతేఽప్య విద్యత్వ మనుద్వాహశ్చ పండితే.

2. యూనశ్చ పరదారాది దారిద్ర్యంచ కుటుంబినః
పుత్రదుఃఖస్య నాస్త్యన్తో ధనీచేన్మ్రియతే తదా.

పుట్టిన పిదప గ్రహబాధలచేతను, రోగ బాధలచేతను, అల్లరి చేతను, దుస్సాంగత్యముచేతను, విద్య లేమిచేతను, దారిద్ర్యమువలనను పుత్రుడు తల్లిదండ్రులకు దుఃఖమునే కలుగజేయుచున్నాడు.

ఏవం నివిచ్య పుత్రేఽసౌ ప్రీతిం త్యక్త్వానిజాత్మని
నిశ్చిత్య పరమాం ప్రీతిం వీక్షతే తదహర్నిశమ్.

"ఈ ప్రకారముగ వివేచించి పుత్రునిపై ఆసక్తిని విడనాడి ఆత్మయందే పరమప్రీతిని సదా యుంచవలెను." — ఈ ప్రకారముగ శ్రుతిస్మృతులు వుద్ఘోషించుచుండ నీవు పుత్రుడే ఆత్మయని సుఖప్రదుడని యేల వాదించుచున్నావు? నీ అసత్య ప్రలాపముల నిక కట్టిపెట్టుము.

కొడుకుల్ పుట్టరటంచు నేర్తు రవివేకుల్ జీవవభ్రాంతులై
కొడుకుల్ పుట్టరె కౌరవేంద్రున కనేకుల్ వారిచే నేగతుల్
వడసెం? బుత్రులులేని యా శుకునకున్ బాటిల్లెనే దుర్గతుల్?
చెడునే మోక్షపదం బపుత్రకునకున్ శ్రీకాళహస్తీశ్వరా.

(దూర్జటి)

ఇంకను వినుము— నీవు పుత్రుని నే ననుచున్నావా, లేక నాపుత్రు డనుచున్నావా? నా పుత్రు డన్నపుడు నీవు వేఱు

పుత్రుడు వేఱు అగుటలేదా? మఱియు పుత్రుడు లేనివాడు దుఃఖము నొందుచున్నాడని అంటివిగదా, నీ పుత్రుడు క్షేమముగా నుండగోరి నీ వెంత తాపత్రయ పడుచున్నావు. ఎన్ని వ్యసనములను పొందుచున్నావు. పుత్రుడే తాను అని చెప్పిన వాక్యము సామాన్యుల కొఱకే యగును. మఱియు పుత్రుని జూచినంతనే ఆనందము కలుగునని యుంటివిగదా! నీకు ఆకలి అయినప్పుడు గాని, వ్యాధి సంభవించినప్పుడుగాని, భోజనము, ఔషధములు లేకనే నీ పుత్రుని జూచినంత మాత్రముచేత అవి తొలగిపోవుచున్నవా?

పుత్రుడే ఆత్మయైతే పుత్రుడు పుట్టుటకు ముందున్న మరణించిన వెనుకనున్న, ఆతడు ఇతర చోటులకు బోయి యుండు కాల మందున్న నీవు వుంటివా లేదా? కాబట్టి పుత్రుడు ఆత్మ ఎన్నటికి కానేరదు.

ఈ ప్రకారముగ వాది వకీలు ప్రతివాది సాక్షియగు పుత్రాత్మవాదిని వాదమందు తూర్పారపట్టగా ఆ వాదమునకు తట్టుకొనలేక యతడు మిణికరించుచు కోర్టునందు నిలబడెను. అపుడు జడ్జిగా రాతనిని అసమర్థుడని యెంచి అచ్చోటనుండి పంపివేయవలసినదిగా ఆజ్ఞ యొసంగి నాల్గవ సాక్షి యగు దేహాత్మవాదిని పిలువనంపించెను.

4వ సాక్షి యగు దేహాత్మవాది విచారణ

అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడైన నిత్య నిర్మల నిర్గుణ నిరాకార నిర్వికల్ప నిశ్చల పరబ్రహ్మము యొక్క సాక్షాత్ స్వరూపమే అయి విలసిల్లుతున్న శ్రీ సద్గురు ప్రభు చక్రవర్తి గారైన జడ్జిగారి సాన్నిధ్యమున ప్రతి వాదుల వకీలగు ఘోర మూఢ బుద్ధి యను వాడు లేచి దేహాత్మవాదిని బిలిచి సర్వశక్తిగల సద్గురు ప్రభువుయొక్క సన్నిధానమున నిజము తప్ప మఱేమియు పలుకనని అతనిచే ప్రమాణము చేయించి ఇవ్విధముగ అతనిని ప్రశ్నించెను.—

ప్ర :- నీపేరేమి ?

ఉ :- నా పేరు దేహాత్మ.

ప్ర :- ఈ వ్యాజ్యమున సొత్తైన ఆత్మనెఱుఁగుదువా?

ఉ :- దేహమే ఆత్మయని యెఱుఁగుదును.

ప్ర :- దేహమే ఆత్మయని యెట్లెఱిఁగినావు?

ఉ :- దేహ ముండిననే సమస్త భోగభాగ్యములు అనుభవించుటకు వీలున్నవి, కావున దేహమే ఆత్మయని నే నెఱుఁగుచున్నాను.

వాదివకీలు చేయు క్రాసు పరీక్ష

ఓయీ! ఈ దేహమును గ్రహించక పూర్వమున్ను, దేహము నశించిన వెనుకనున్ను నీ వున్నావా ? లేదా ? వున్నావు. అట్టిచో ఈ దేహము నీ వెట్లగుదువు? మఱియు ఈ దేహము నీవైనచో ఎల్లకాలములందును దాని జ్ఞప్తి నీకుండవలెను. నిద్రలో దాని భావన నీకు లేదు. మరణ మూర్చాదులందును లేదు. అట్టి దేహము నీవెట్లు కాగలవు? కావున దేహమే ఆత్మయని నీవు వ్యర్థముగ ప్రగల్భములు పలుకుచున్నావు. అది శాస్త్ర విరుద్ధము, అనుభవ విరుద్ధము. మరియు దేహము అపవిత్రమైనది. మలమూత్ర రక్తమాంసాదుల సంఘాతమే ఈ దేహము. అట్టి దేహము పవిత్రమగు ఆత్మ యెట్లు కాగలదు? మహనీయులు చెప్పు అనుభవ వాక్యములను వినుము.—

'దేహోఽహమితి సంకల్పో మహాపాపమితి స్ఫుటమ్,
దేహోఽహమితి యజ్ఞానం తదేవ నరకం స్మృతమ్.'
(తేజోబిందు-ఉప)

'నేను దేహమును' అను సంకల్పము మహా పాపకరమైనది మఱియు 'నేను దేహమును' అను జ్ఞాన మేది కలదో అదియే నరకమని చెప్పబడినది.

జాతం మృతమిదం దేహం మాతాపితృమలాత్మకం
సుఖదుఃఖాలయామేధ్యం స్పృష్ట్వాస్నానం విధీయతే

—పుట్టునదియు, చచ్చునదియు, మాతాపితృమల స్వరూపమైనదియు, సుఖదుఃఖ నిలయమునగు ఈ దేహమును తాకినచో స్నానము విధింపబడినది.

నవద్వార మలస్రావం సదాకాలే స్వభావజం
దుర్గంధం దుర్మలోపేతం స్పృష్ట్వా స్నానం విధీయతే

స్వభావముగ నిరంతరము తొమ్మిది ద్వారముల నుండియు మలము స్రవించుచున్నదనియు, దుర్గంధయుత మైనదియు నగు ఈ దేహమును తాకినచో స్నానము విధింప బడినది—అని మైత్రేయోపనిషత్తు పలుకుచున్నది.

ఇట్టి నింద్యమైన శరీరమును ఆత్మయని వచించుట కేవలము హాస్యాస్పదమే యగును, వాస్తవముగ మానవుడు దేహ మెన్నటికి కాడు. నిర్వికల్ప చిదాత్మయే యగును. కావున 'దేహము నేను' అను అహంకారమును పారద్రోలి 'బ్రహ్మమునే నేను' అను నిశ్చయము కలవాడు మాత్రమే పరమ శ్రేయమును బొందగలడు. దేహోహంభావము కల వాడు సంసారదుఃఖరూప గర్తమున బడి జనన మరణములను బొందుచు అత్యంత క్లేశమును బడయుచుండును.

వాధివకీలు కావించిన ఈ వాదనను విని దేహాత్మ వాది మారుమాటాడక స్తబ్దుడై నిలబడగా, అతడు అసమర్థ డని యెంచి జడ్జిగా రతనిని కోర్టునుండి బయటకు పంపించివేసి తక్కిన సాక్షులగు ప్రాణాత్మవాది మున్నగువారిని విచారింప దొడగెను.

5వ సాక్షియగు ప్రాణాత్మ వాది విచారణ

నిత్య నిర్మల నిర్గుణ నిరాకార నిర్వికల్ప నిశ్చల పర బ్రహ్మము యొక్క సాక్షాత్ స్వరూపమే అయి వెలుగొందు చున్న శ్రీ సద్గురు ప్రభు చక్రవర్తిగారైన జడ్జిగారి సన్నిధాన మున ప్రతివాదుల వకీలగు ఘోర మూఢ బుద్ధి యనువాడు లేచి ప్రాణాత్మవాదిని బిలిచి 'సర్వశక్తిగల సద్గురు ప్రభువు యొక్క సాన్నిధ్యమున నిజము తప్ప మఱేమియు పలుక'నని అతనిచే ప్రమాణము చేయించి ఇవ్విధముగ నాతనిని ప్రశ్నిం చెను—

ప్ర:- నీ పేరేమి ?

ఉ:- నా పేరు ప్రాణాత్మవాది.

ప్ర:- నీవు ఆత్మ నెఱుఁగుదువా ?

ఉ:- ప్రాణమే ఆత్మయని యెఱుఁగుదును.

ప్ర:- ఇందులకు ప్రమాణ మేదైన చెప్పగలవా ?

ఉ:- 'అన్యోంతరాత్మ ప్రాణమయః' యనియు, "ప్రాణోహ పితా, ప్రాణోమాతా, ప్రాణో భ్రాతా, ప్రాణస్స్వసా, ప్రాణ ఆచార్యః, ప్రాణో బ్రాహ్మణః"

అనియు శాస్త్రములు వక్కాణించుచు ప్రాణమే సమస్తమని బోధించుచున్నవి. మఱియు సర్వమును లయిం చిన సుషుప్తికాలమందు ప్రాణము లయించక యుండుట ముఖ్యముగ గమనించదగి యున్నది,

వాదివకీలు చేయు క్రాసు పరీక్ష

ఓయీ! నీ వాదము చాల పేలవముగా నున్నది, శ్రుతి, యుక్తి. అనుభవములచే నీ వాదన నిపుడు నేను ఖండించి వేయుచున్నాను. నీవు నా 'ప్రాణమ'ని చెప్పు చున్నావు కదా, అపుడు నీవు వేఱు, ప్రాణము వేఱు అయి యుండుటచే నీవే ప్రాణ మెట్లు కాగలవు ?

న ప్రాణేన నాపానేన మర్త్యో జీవతి కశ్చన
ఇతనేణ తు జీవన్తి యస్మి న్నేతా వుపాశ్రితౌ

అను కఠోపనిషద్వాక్యమును నీవు వినియున్నట్లయితే ఈ ప్రకారముగ ప్రేలకుందువు. 'మానవుడు ప్రాణముచే గాని, అపానముచే గాని జీవించుటలేదు. ఆ రెండింటికిని ఆధారభూతమైన మఱియొక దానిచేతనే సచ్చిదానందాత్మ చేతనే) జీవించుచున్నాడు' అని శ్రుతిభగవతి ఎలుగెత్తి చెప్పు చున్నది. వాస్తవముగ ప్రాణవాయువు జడమైనది. దానికి స్వతః సత్త లేదు. ఆత్మయొక్క సత్తచేతనే అది జీవించు చున్నది. ప్రాణము పోయినప్పటికి జీవుడు నశింపక కర్మాను గుణ్యమగు అన్యదేహమును స్వీకరించుచున్నాడు. కావున 'నేను ప్రాణమును' అను వాక్యము నిరాధారమైనది. కొందఱు హఠయోగము నభ్యసించి, కుంభకమును జేపట్టి దీర్ఘకాలము ప్రాణవాయువు లేకనే జీవించుచుండుట కానంబడుచున్నది. ప్రాణమే తానైనచో ఆసమయమున వారు

మృతినొందియుండవలసినది గదా! అట్లు కాలేదేమి? కావున మనుజుడు ప్రాణమే తా నెన్నటికిని కాడు.

ప్రాణ మనునది ఆత్మకు ఒకానొక కోశము. కోశము వేఱుగాను ఖడ్గము వేఱుగాను వుండునట్లే పంచకోశముల కంటె ఆత్మ భిన్నముగ నున్నది. కావున ప్రాణము ఎన్నటికిని ఆత్మకాదు. ప్రాణమే తాను కానపుడు ఇక ప్రాణధర్మము లగు క్షుత్పిపాసలు తా నెట్లగును? కాబట్టి వాని యన్నిటి కంటె విలక్షణుడగు నిర్వికార నిశ్చల పరమాత్మయే వాస్తవ మున తా నగును. ఈ సత్యమునే వుపనిషత్తులు ఘోషించు చున్నవి.

మఱియు ప్రాణమగు నీవు ప్రజ్ఞరూపమగు ఆత్మయై యుండినచో మనుజుడు గాఢనిద్ర పోవుచున్నపుడు ఎవరైన జేబులోని వస్తువును అపహరించుకొని పోవుచుండగా నీ వేల కనిపెట్టలేకున్నావు ? కావున బయట వీచుచున్న గాలివలె నీవు జడస్వరూపమవు. వాస్తవముగ నిన్ను నీ వెఱుఁగలేవు. నీ కన్యమైనదానినిన్ని ఎఱుఁగలేవు. అట్టి ప్రజ్ఞాశూన్యమగు నీవు ఆత్మ యెట్లు కాగలవు?

ఈ ప్రకారముగ వాదివకీలు ప్రతివాది సాక్షియగు ప్రాణాత్మవాదిని వాదమందు తూర్పారపట్టగా, ఆ వాదమునకు తట్టుకొనలేక యతడు మిణికరించుచు కోర్టునందు నిలబడెను, అపుడు జడ్జిగా రతనిని కేవలము అసమర్థుడని యెంచి అచ్చోటనుండి పంపివేయవలసినదిగా ఆజ్ఞ యొసంగి, ఆఱవ సాక్షి యగు మనోమయాత్మవాదిని పిలువనంపించెను.

6వ సాక్షి యగు మనోమయాత్మవాది విచారణ

శ్రీ సద్గురు ప్రభు చక్రవర్తిగారైన జడ్జిగారి సన్నిధానమున ప్రతివాది వకీ లగు ఘోరమూఢబుద్ధి యనువాడు లేచి మనోమయాత్మవాదిని బిలిచి 'సర్వశక్తిగల సద్గురు ప్రభువు యొక్క సాన్నిధ్యమున నిజము తప్ప అన్యమేమియు పలుక' నని అతనిచే ప్రమాణము చేయించి ఇవ్విధముగ నాతనిని ప్రశ్నించెను,

ప్రశ్న :- నీ పేరేమి?

ఉత్తరము :- నా పేరు మనోమయాత్మవాది.

ప్ర :- నీవు ఆత్మనెఱుఁగుదువా?

ఉ :- మనస్సే ఆత్మయని యెఱుఁగుదును.

ప్ర :- ఇందులకు ప్రమాణ మేదైనా చెప్పగలవా?

ఉ :- చెప్పలేకేమి? ఎన్నియో పరిమాణములు కలవు-వినుడు.

1. అన్యోఽన్తరాత్మా మనోమయః

2, మనసా కల్పితం సర్వం మనసా పరిపాలితం
మనసా సంస్మృతం తస్మాత్ మన ఏవాప్తికారణమ్

ఇంతియే కాదు. నేను లేని సుషుప్తి కాలమున జగత్తు తోచక, నేను వుండు జాగ్రత్స్వప్న కాలములందు జగత్తు తోచుచున్నదిగదా. కాబట్టి సమస్తము నేనే. నేనే, ఆత్మను.

మనోమయాత్మవాదియొక్క ఆ వాక్యములను విని వాది వకీ లాతనిని ఈ ప్రకారముగ క్రాసు పరీక్ష చేయ దొడగెను.

వాది వకీలు చేయు క్రాసు పరీక్ష

నీవే ఆత్మ అయితే 'నా మనస్సు' అని జీవుడేల చెప్పుచున్నాడు? అపుడు మనస్సు వేఱు, తాను వేఱు కాలేదా? ఇక నే నడుగు ప్రశ్నలకు సమాధాన మిమ్ము?

ప్ర :- నీ తల్లి యెవరు ?

ఉ :- అవిద్య.

ప్ర :- నీ వృత్తి యేమి ?

ఉ :- శ్రోత్రాదీంద్రియములను సాయముగా గైకొని శబ్దాది విషయములను గూర్చి చింతించుట.

ప్ర :- ఈ వివాద సొత్తగు ఆత్మ నీ కేలాగు దొరికినది ?

ఉ :- నా తల్లి యగు అవిద్య మూలకముగ నాకు లభించినది.

ప్ర :- ఓ మనోమయాత్మవాడీ! నీ స్వరూపము చిత్తుగాదు. జడము కాదు, రెండు కలసినది కాదు. చిత్తైనచో వికారము లేకుండవలెను. అట్లు లేదు జడమైనచో కదలక వుండవలసి యుండును, అట్లు లేదు చిజ్జడములు రెండు కలిసియుండుట ప్రకాశాంధకార

ముల కలయిక వలె అసాధ్యమే యగును. కావున నీవు వాస్తవముగ లేని దానవు, అట్టినీవు ఆత్మ యెట్ల గుదువు?

అని ఈ ప్రకారముగ వాది వకీలు చేయు క్రాసు పరీక్షకు తట్టుకొనలేక మనోమయాత్మవాది మిణకరించి చూచు చుండ. కోర్టువా రతనిని అసమర్థుడని యెంచి అచ్చోటునుండి లాగి పారవైచి తక్కిన విజ్ఞానమయ, ఆనందమయాత్మ వాదులను పిలువ నాజ్ఞాపించిరి.

7వ సాక్షియగు విజ్ఞానమయాత్మవాది విచారణ

శ్రీ మదఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడైన పరబ్రహ్మము యొక్క సాక్షాత్ స్వరూపమే అయి విలసిల్లు చున్న శ్రీ సద్గురు ప్రభు చక్రవర్తిగారైన జడ్జిగారి సన్నిధానమున ప్రతివాది వకీ లగు ఘోర మూఢబుద్ధి యనువాడు లేచి విజ్ఞానమయాత్మవాదిని పిలిచి సర్వశక్తిగల సద్గురు ప్రభువు యొక్క సాన్నిధ్యమున నిజము తప్ప అన్య మేమియు పలుకనని అతనిచే ప్రమాణము చేయించి ఇవ్విధముగ నాతనిని ప్రశ్నించెను.

ప్ర :- నీ పేరేమి?

ఉ :- నా పేరు విజ్ఞానమయాత్మవాది.

ప్ర :- నీ తండ్రి పేరు ?

ఉ :- అహంకారము.

ప్ర :- నీవు ఆత్మ నెఱుంగుదువా ?

ఉ :- నేనే ఆత్మ. నన్ను వినాగా ఆత్మయను వస్తువే లేదు.

ప్ర :- ఇందులకు ప్రమాణ మేదైనా చెప్పగలవా ?

ఉ :- అన్యోన్యన్తరాత్మా విజ్ఞానమయః; విజ్ఞానమానందం బ్రహ్మ-మున్నగు వాక్యములే ప్రమాణములు.

ప్ర :- యుక్తి ఏదైనా చెప్పగలవా ?

ఉ :- భువి నేలు నరాధిపుని యొక్క ఆజ్ఞ ప్రకారము జనులు నడచుకొనునట్లును, సర్వేంద్రియములను నా యనుమతి ప్రకారము నడచుకొనుటయే యుక్తి.

అ వాక్యములను వినగానే సాత్త్వికాంశబుద్ధి యను వాది వకీలు లేచి కోర్టువారికి నమస్కరించి సదరు సాక్షిని ఈ ప్రకారముగ క్రాసు పరీక్ష చేయ దొడగెను.

వాది వకీలు చేయు క్రాసు పరీక్ష

ప్ర :- నీ వెవరవు ?

ఉ :- విజ్ఞానమయాత్మవాదిని

ప్ర :- నీ తాతగారి పేరేమి ?

ఉ :- ఋషిమూలము, నదిమూలము విచారించగూడదు.

ప్ర :- నీతల్లి యెవరు ?

ఉ :- అవివేకచూడామణి.

ప్ర :- నీవు సదా చేయుచుండు పను లేవి ?

ఉ :- చూచుట, వినుట, తాకుట, రుచి చూచుట మొదలగు ఇంద్రియ వ్యాపారములే నా పనులు.

ప్ర:- నేత్రాదీంద్రియములు చెడిపోయిన కాలమందు ఆ పనులను నీ వెట్లు చేయగలవు? కావున పైన వివరించిన పనులను నేను చేయుచున్నానని నీ వెట్లు చెప్పినావు ? మఱియు నీవే ఆత్మ అయితే నా యిల్లు, నా వాకిలి, నా బుద్ధి అని చెప్పుచుండుటవలన, బుద్ధి వేఱు, నీవు వేఱుగా నున్నావుగదా, అట్టిచో బుద్ధి (విజ్ఞానమయుడు) యగు నీవు ఆత్మవు ఎట్లు కాగలవు?

ఉ -- ఇంతవరకు లోకమందు నీ వెవరవని న న్నడిగినవారే లేరు. నీ వీ దినమున నా గుట్టు బయటపెట్టి నాశనము చేసినావు. నా యోగ్యత చెడగొట్టినావు. నే నెటువంటి వాడనో మీ కేమి తెలియును ? నేను చేయని యాగములే లేవు. నా యోగ్యతను తెలిసికొనుటకు నాకు సమానమైనవారికే తప్ప అన్యులకు సాధ్యపడదు. ఈ

కోర్టునందున్న ప్రతిపక్షులు గాని మీరు గాని నా వాస్తవ స్వరూపము నెఱుఁగరు. నేను సర్వజ్ఞుడను నేను చేయని, చేయజాలని పనే లోకములో లేదు. నే ననుభవింపని సుఖములే లోకమున లేవు.

ప్ర : ఓయీ! నేనడిగిన ప్రశ్నలకు సరియైన సమాధానము నీయక నిన్ను నీవు వూరక పొగడుకొనుచున్నావు. ఇంతవఱకు నిన్నెవరును కోర్టుముందు విచారణకు తేనందున నీ కింత అహంకారము బలిసిపోయినది. నీగుట్టు మరల ఇప్పుడే బయటపెట్టెదను చూడుము. ఈశ్వరాజ్ఞ వలనను, భగవన్నియతి చేతను, జగత్తులోని సమస్త క్రియలు జరుగుచుండ అవివేకులు తమవలననే సమస్తము జరుగుచుండునని విఱ్ఱవీగుచుందురు. నేనే కర్తనని చెప్పుట వలన లేనిపోని కర్తృత్వమును నీవు నీయం దారోపించుకొనుచున్నావు. వాస్తవముగ నీవు చైతన్యమవు కావు. మాయవలన కల్పింపబడిన స్థూల శరీర ధర్మములును, సూక్ష్మ శరీరము యొక్క షడ్భావ వికారములును, ఇంద్రియములయొక్క వికారములును, ప్రాణము యొక్క చలనత్వమును, ఆత్మ యొక్క ప్రకాశవంతమైన జ్ఞానమును అంతయు చేర్చి నేను కర్తనని చెప్పుచున్నావు. ఇట్లు చెప్పవచ్చునా?

జ్ఞానేంద్రియైస్సహబుద్ధిర్విజ్ఞానమయకోశ - అనుపైంగలోపనిషద్వాక్యానుసార బుద్ధియు జ్ఞానేంద్రియములైదును గూడి విజ్ఞానమయకోశ మనబడును. అంతియేకాని అది ఆత్మ కాదు. అది దృశ్యవర్గములో చేరినది, జడమైనది.

అని ఈ ప్రకారముగ వాది వకీలు క్రాసు పరీక్ష చేయగా తన గుట్టు బయటపడినందున ప్రత్యుత్తర మీయలేక విజ్ఞానమయాత్మవాది స్తబ్ధుడై మిణకరించి చూచుచుండ కోర్టువారతనిని అసమర్థుడని నిశ్చయించి బయటకు లాగివైచిరి, తదుపరి జడ్జిగారు ఆనందమయాత్మవాది, శూన్యవాది యున్నగు వారిని పిలువ నాజ్ఞాపించిరి.

8వ సాక్షి యగు ఆనందమయాత్మవాది విచారణ

శ్రీ సద్గురు ప్రభుచక్రవర్తిగారైన జడ్జిగారి సన్నిధానమున ప్రతివాది వకీలగు ఘోర మూఢబుద్ధి యనువాడు లేచి ఆనందమయాత్మవాదిని పిలిచి సర్వశక్తిగల సద్గురు ప్రభువుయొక్క సాన్నిధ్యమున సత్యమే పలుకుదునని అతనిచే ప్రమాణము చేయించి ఈ ప్రకారముగ నాతనిని ప్రశ్నించెను.

ప్ర :- నీ పేరేమి ?

ఉ :- ఆనందమయాత్మవాది.

ప్ర :- ఆత్మను నీ వెఱుఁగుదువా !

ఉ :- ఆనందమయుడ నగు నేనే ఆత్మ. నన్ను వినగా వేఱు ఆత్మ లేదు.

ప్ర :- ఇందులకు ప్రమాణమేదైన చెప్పగలవా ?

ఉ :- అన్యోన్యన్తరాత్మా ఆనందమయః . . యున్నగు వాక్యములే ప్రమాణములు.

ప్ర :- యుక్తి ఏదైన చెప్పగలవా ?

ఉ :- సమస్త ప్రాణికోట్లును సుషుప్తి సుఖము కొఱకు చాప, దిండు మొదలైన సాధనములను వెతకుకొనుట లేదా? ఇంతకుమించి వేరొక యుక్తి ఏమి కావలెను ? పగలంతయు పనిచేసి రాత్రి ప్రతివారును నన్నాశ్రయించవలసిందే గదా ?

ఆ వాక్యములను వినగానే సాత్త్వికాంశ బుద్ధి యను వాది వకీలు లేచి కోర్టువారికి నమస్కరించి సదరు సాక్షిని ఈ ప్రకారముగ క్రాసుపరీక్ష చేయ నారంభించెను.

ఓయీ! నీవు చెప్పిన స్థితి ఆనందఘనమగు ఆత్మస్థితి కాదు, అది దృశ్యవర్గములో చేరిన ఆనందమయ కోశము యొక్క స్థితి, దృశ్యవస్తువు ఏ కాలమందును స్థిరము కాదు. కావున ఆనందమయ కోశమును అవిచ్ఛిన్నమైనది కాదు, మఱియు అది ఏకదేశమై కలుగు ఆనందము. అవస్థాత్రయ వికారములలో జేరినట్టిది. వాస్తవమగు ఆత్మానందము అట్టిది కాదు, ఆ యానందము—

1. తత్ బ్రహ్మ తాపత్రయాతీతం. షట్కోశ వినిర్ముక్తం, షడూర్మి వర్జితం, పంచకోశాతీతం, షడ్భావ వికారశూన్యం....

2. నిర్వికల్ప మనంతం చ హేతు దృష్టాంత వర్జితం- మున్నగు శ్రుతివాక్యములను బట్టి నిర్వికారమైనది, దృశ్యాతీతమైనది.

ఈ ప్రకారములైన వాది వాక్యములను విని కోర్టువారు ఇంతకు మునుపు ప్రతివాది తరపున సాక్షి చెప్పిన వాక్యములు అసంగతములని యెంచి అతనిని బయటకు నెట్టివైచి ప్రతివాది తరపు మఱొక సాక్షి యగు శూన్యాత్మవాదిని పిలువనంపించి పూర్వ విధముగనే ప్రశ్నింప, వాఁడు శూన్యమే ఆత్మ యని వాదింపదొడంగెను.

వెంటనే వాది వకీలు లేచి శూన్యమే ఆత్మయైనచో ఆ శూన్యమును తెలిసికొనువా డొక డుండవలెను గదా యనియు, సుషుప్తినుండి మేలుకొనిన పిదప "నేను హాయిగా నిద్రించినాను' అని చెప్పగల్గుటచే ఆ సుషుప్తి సమయమున గూడ ఒకానొక ప్రజ్ఞావస్తువు మేలుకొనియే యున్నదనియు సుషుప్తిని సాక్షిగా గమనించుచున్న దనియు స్పష్టమగుచున్న దని, కాబట్టి శూన్యమున్ను దృశ్యమగుటచే అది ఆత్మ యెన్నటికిని కాదనియు గంభీరముగ వాదింప, శూన్యాత్మవాది కిక్కురుమనక నిలబడియుండ, అతడు అసమర్థుడని యెంచి కోర్టువారు వానినిగూడ బయటకు సాగనంపిరి.

వాదితరపు సాక్షుల విచారణ

1వ సాక్షి యగు వివేకుని విచారణ

ప్రతివాది తరపు సాక్షులగు ధనాత్మవాది, పుత్రాత్మవాది, దేహాత్మవాది మొదలగు యెనిమిది మందిని విచారించిన పిదప శ్రీ సద్గురు ప్రభుచక్రవర్తిగారైన జడ్జిగారు ఇక వాది తరపు సాక్షులను విచారించదలచినవాడై వారలను పిలువ నంపించి, మొట్ట మొదట వివేకుడను ప్రథమ సాక్షిని కోర్టులోపలకు రప్పించెను.

అతడు లోనికి రాగానే అతిసూక్ష్మగ్రాహియగు సాత్త్వికాంశబుద్ధియను వాది వకీలు లేచి వాది తరపు మొదటి సాక్షియగు వివేకుడనువానిని కోర్టువారి ముందు నిలబెట్టి అసత్యము చెప్పనని ప్రమాణము చేయించి, నా తరపు సాక్షులను నే నడుగ వలసిన మాట లేవియు లేవని వచింప, అంతట ప్రతివాది వకీలగు ఘోర మూఢ బుద్ధి లేచి వివేకుని యిట్లు ప్రశ్నింపదొడగెను—

ప్రశ్న :- నీ పేరేమి ?

ఉత్తరము :- వివేకుడు.

ప్ర :- నీ వెవని కుమారుడవు ?

ఉ :- తత్త్వపరిశీలుని కుమారుడను.

ప్ర :- నీవు ఆత్మ నెఱుఁగుదువా ?

ఉ :- సలక్షణముగా నెఱుఁగుదును.

ప్ర :- ఆత్మ నెఱుఁగుటకు లక్షణ మెందుకు ?

ఉ :- అది అత్యావశ్యకము.

ప్ర :- ఆ లక్షణమున కేమి పేరు ?

ఉ :- దానికి భాగత్యాగలక్షణమని పేరు.

ప్ర :- దానిని వివరించి చెప్పుము ?

ఉ :- "సోఽయం దేవదత్తః" — ఆ దేవదత్తుడే వీడు — అను వాక్యముయొక్క వాచ్యార్థమందు ఒక భాగమగు సః, అయం - అనెడు దేశకాలములను తొలగించి మఱొక భాగమగు దేవదత్తుడను వ్యక్తిని త్యజించక గ్రహించుట భాగత్యాగలక్షణమని పేరు. అట్లే దేహేంద్రియ విశిష్టాత్మయందు దేహేంద్రియాదులను "నేతి నేతి" (ఇదికాదు, ఇదికాదు) మున్నగు వాక్యముల ద్వారా తొలగించి శేషించిన చిద్రూపాత్మను గ్రహించవలసి యున్నది. కావున ఆత్మ నెఱుఁగుటలో భాగత్యాగ లక్షణ మత్యావశ్యకమై యున్నది.

ప్ర :- దీనికి యుక్తి యేమి ?

ఉ :- పంచభూతములవలనే శ్రోత్రాది యింద్రియములున్న జడరూపములే. అంతఃకరణమును జడమై

నదే. ఏల యనగా సుషుప్తియందది లయించిపోవుచున్నది. చిత్తు (ఆత్మ) కెప్పుడును లయభావము లేదు. అగ్ని సంబంధమువలన తృణకాష్ఠాదులు అగ్నిరూపములుగా కనబడురీతి ఆత్మయొక్క కల్పిత సంబంధముచే పంచకోశములు చిద్రూపాత్మవలె తోచుచున్నవి. పంచకోశములను జీవుడు నాది నాది యని యెఱుఁగుటవలన అవి దృశ్యరూపములై, జడములై, అనాత్మ స్వరూపములై యున్నవి.

ప్ర :- ఆ యాత్మకు కర్తృత్వాది సంసారము కలదా, లేదా?

ఉ :- ఎన్నడును లేదు.

ప్ర :- ఇందులకు ప్రమాణములేవైన చెప్పగలవా?

ఉ :- లెక్కలేనన్ని చెప్పగలను. "నాహంకర్తా నైవభోక్తా ప్రకృతే స్సాక్షిరూపతః, మత్సాన్నిధ్యాత్ప్రవర్తన్తే దేహాద్యా అజడా ఇవ. స్థాణుర్నిత్యస్సదానందశ్శుద్ధో జ్ఞానమయోఽమలః, ఆత్మాహం సర్వభూతానాం విభుస్సాక్షీ న సంశయః, బ్రహ్మైవాహం - సచ్చిదానంద రూపం.

నాహం దేహో జన్మమృత్యూ కుతో మే

నాహంకారః క్షుత్పిపాసో కుతో మే

నాహం చేతశ్శోకమోహౌ కుతో మే
నాహం కర్తా బంధమోక్షౌ కుతో మే.

అని సర్వసారోపనిషత్తు ఘోషించుచున్నది. ఆత్మ కర్త కాదు, భోక్త కాదు, కేవలం చిదానంద స్వరూపమే యని ఆయా శ్రుతులు ఐక్యకంఠమున వక్కాణించుచున్నవి.

ప్ర :- ఆత్మయను సొత్తు సత్తా, అసత్తా?

ఉ :- ఆత్మ ఏ కాలమందును అసత్తు కానేరదు. అది సత్తే.

ప్ర :- కారణమేమి?

ఉ :- (దృశ్యము) అంతయు నశించినప్పటికిని ఆత్మ నశింపదు, అందుచేత.

ప్ర :- ఇందులకు ప్రమాణమేమి?

ఉ :- 'సదేవ సోమ్యేదమగ్ర ఆసీత్' అని ఛాందోగ్యోపనిషత్తు వచించినరీతి సృష్టికి పూర్వమున్న ఆత్మయొకటియే వెలయుచున్నది. మఱియు—

స్వప్నాంతం జాగరితాంతం చోభౌ యేనానుపశ్యతి
మహాన్తం విభుమాత్మానం మత్వా ధీరో న శోచతి.

అను కఠోపనిషద్వాక్యరీతిగా జాగ్రత్స్వప్న సుషుప్తులను మూడవస్థలయందును సాక్షిగా ఆత్మ ప్రకాశించుచు కాలత్ర

యములందును సద్రూపముగ వర్తించుచున్నది. అట్లే చిద్రూపముగను, ఆనందరూపముగను గూడ వెలయుచున్నది.

ఈ ప్రకారముగ వాది సాక్షి యగు వివేకుడు వచించిన వాక్యములను జడ్జిగారు విని ప్రతివాది వకీలగు ఘోర మూఢబుద్ధి యను వానిని జూచి "నీవు చేయు క్రాసు పరీక్ష వలన, బియ్యమును దంచదంచ తెలుపగునట్లు, నీ గుట్టు బయట పడుచున్నది, కావున ఇక నీ ప్రశ్నలను చాలించుము" అని పలికి వాది సాక్షియగు వివేకుని యోగ్యతకు మెచ్చి వివాదము ముగియునంత వఱకు వాది యగు ముముక్షువునకు సహాయముగ నుండుమని అతనికి జెప్పి ఇక వాదితరపు రెండవ సాక్షియగు వైరాగ్యుని పిలువనంపించెను.

జడ్జిమెంటు

వాదితరపు సాక్షి యగు వివేకుని విచారించిన పిదప, (వాది తరపు) తక్కిన సాక్షులగు వైరాగ్యుడు, శముడు, దముడు మున్నగువారిని గూడ విచారించి, వారి సాక్ష్యములను గూడ గైకొని, శ్రీ సద్గురు ప్రభుచక్రవర్తిగారైన జడ్జిగారు, ఇక కాలయాపన చేయక, పరిస్థితిని చక్కగా ఆకళింపు చేసికొనినవాడై, ఇరుపక్షముల బలాబలములను పరిశీలించి ఎవరి పక్షమున న్యాయమున్నచో లెస్సగ యోచించి, తన జడ్జిమెంటును ఈ క్రింది ప్రకారముగ చెప్పివైచెను.—

ముముక్షు వను వాది తన వివాద పత్రముతోపాటు పొందుపఱచిన ఉపనిషదాది ప్రమాణములను బట్టియు, వాది తరపు సాక్ష్యమిచ్చిన వివేకాదుల స్టేట్ మెంటులను బట్టియు, ఆత్మయను సొత్తు కేవలము ముముక్షువునకు జెందినదే యని ముమ్మాటికిని స్పష్టపడుచున్నది. సదరు సొత్తును అజ్ఞాన సహాయముచే కామాది ప్రతివాదులు అనాది కాలముననే దొంగిలించి, దానిపై నేటివఱకు తమ హక్కు భుక్తములను చెలాయించుచున్నారు. ఆత్మయను సొత్తు తమకు జెందినదే యని ప్రతివాదులు గావించిన వాదములో ఏమాత్రము పస కన్పించుటలేదు. అందువలన వారి వాదములతో నే నేకీభవించుట లేదు.

డిక్రీ

ప్రతివాదులైన కామాదులు తాము వాది (ముముక్షువు) నుండి అపహరించిన ఆత్మ యను సొత్తును తత్క్షణమే అతనికి స్వాధీనము చేసివేయవలెను. మఱియు అతడు కోర్టు నష్టపరిహారమును కోర్టు ఖర్చులతో సహా చెల్లించి తమ దురాగతమునను క్షమాపణ వేడుకొనవలెను. ఈ దినము మొదలుకొని ముద్దాయిలగు కామాదులు యావజ్జీవ కారాగార శిక్ష అనుభవింపవలెను.

సత్యమేవ జయతే నానృతమ్.

గీతామకరందము

రచయిత : శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

రాయల్ సైజు 1100 పేజీలు గల మహా గ్రంథము ఇందు శ్రీ భగవద్గీత మూల శ్లోకములు, ప్రతి శ్లోకమునకు అవతారిక, ప్రతిపదార్థము, తాత్పర్యము, వ్యాఖ్యానము ప్రశ్నోత్తరములు కలవు. ఇంకను గీతనుగూర్చిన అనేక వివరములు గ్రంథాదియందు పొందుపఱుపబడినవి. ఇవి గాక గీతాతత్త్వమును సుబోధక మొనర్పగల దాదాపు నూఱు పేజీలు గల గొప్ప ఉపోద్ఘాతమున్ను ప్రారంభమున గలదు. గీతాభిలాషులకు చాలా అవశ్యకమైన గ్రంథము.

పూర్తి క్యాలికో బైండు ప్లాస్టిక్ కవరుతో వెల : రు. 90-00

గీతోపన్యాసాల కేసెట్స్

పూజ్య శ్రీ విద్యాప్రకాశనందగిరి స్వాముల వారి గీతోపన్యాసాలు చాలా ప్రశస్తి వహించాయి. వేలకొలది ప్రజానీకం ఈ ఉపన్యాసాలు వినడానికి గీతాయజ్ఞాలకు హాజరయ్యేవారు. తిరుమల తిరుపతి దేవస్థానంవారు పై ఉపన్యాసాల ప్రాముఖ్యంగుర్తించి వాటిని రికార్డుచేసి కేసెట్స్‌గా విడుదల చేశారు. ప్రస్తుతము 1 నుండి 18-వ అధ్యాయము వరకూ కేసెట్స్ లభిస్తున్నాయి.

ఒక అధ్యాయం ఉపన్యాసం కల ఒక కేసెట్ వెల రూ. 35/-

ప్రాప్తిస్థానం :- మేనేజరు,

శ్రీ శుకబ్రహ్మాశ్రమం (P.O)

శ్రీకాళహస్తి (Tq.) చిత్తూరు జిల్లా (A.P.)

శ్రీ శుకబ్రహ్మాశ్రమ గ్రంథములు

1.	గీతామకరందము	98-00
2.	Geethamakaranda (English)	98-00
3.	శ్రీ వసిష్ఠగీత	65-00
4.	రామాయణ రత్నాకరము	50-00
5.	భాగవత రత్నాకరము	50-00
6.	భారత రత్నాకరము	60-00
7.	ఉపనిషద్రత్నాకరము	50-00
8.	గీతోపన్యాసములు	30-00
9.	మోక్షసాధన రహస్యము	30-00
10.	పరమార్థ కథలు	30-00
11.	బ్రహ్మచర్య విజయము	30-00
12.	అధ్యాత్మ రామాయణము	15-00
13.	వసిష్ట మహారామాయణం	15-00
14.	బ్రహ్మానంద వైభవము	15-00
15.	భజనలు, కీర్తనలు	15-00
16.	ఆత్మాను సంధానము	15-00
17.	అమృత బిందువులు	15-00
18.	శ్రీ మళయాళ మహర్షి	10-00
19.	శ్రీ భగవద్గీత (స్థూలాక్షరి)	18-00
20.	శ్రీ భగవద్గీత (మూలం)	6-00
21.	వివేకానంద సింహనాదము	16-00
22.	దివ్యసూక్తులు	7-00
23.	యమలోక వార్తలు	4-00
24.	శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి జీవితచరిత్ర	25-00